సాక్షి
వనపర్తి
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



భళా..బాలోత్సవం

పిల్లలమర్రి బాలోత్సవం కమిటీ నిర్వహించిన బాలోత్సవం-పిల్లల పండుగ అలరించింది.

వివరాలు IIలో ▸



కిటకిటలాడిన కురుమూర్తి

అమావాస్యను పురస్కరించుకొని కురుమూర్తి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వివరాలు IVలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /24.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

రేపే పాలమూరు పరుగులు

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పాలమూరు-రంగారెడ్డి ప్రారంభోత్సవం

- నార్లాపూర్ పంప్‌హౌస్‌లో మొదటి పంపుతో ఎత్తిపోతలు
- మొత్తం ఐదు లిఫ్టులతో కృష్ణానది నీటి తరలింపు
- సీఎం పర్యటన నేపథ్యంలో అధికారుల ఏర్పాట్లు



కృష్ణానది నుంచి పంపుహౌస్‌కు నీటిని తరలించే ప్రాంతం

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా తొలి మోటారు నుంచి రేపే కృష్ణమ్మ పరుగులు పెట్టనుంది. నార్లాపూర్ వద్ద స్టేజ్-1లోని మొదటి మోటారును ప్రారంభించడం ద్వారా సీఎం కేసీఆర్ ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించింది. భూమి నుంచి అర కి.మీ .ఎత్తుకు మించి గరిష్టంగా 670 మీటర్లకు ఎత్తిపోసేందుకు ఇది వరకు ఎక్కడా వినియోగించని స్థాయిలో అతిపెద్ద మోటార్లను ఏర్పాటు చేస్తోంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద సర్జిపూల్, భారీ మోటార్ల వినియోగంతో కృష్ణాజలాలను పాలమూరు గడ్డకు చేర్చే ప్రక్రియలో శుక్రవారం తొలి అడుగు పడనుంది.

అన్ని మోటార్లు
బాహుబలికి మించినవే..



ఎల్లూరు పంపుహౌస్ మోటారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఒక రిజర్వాయర్ నుంచి మరో రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేందుకు అన్ని చోట్లా భారీ సామర్థ్యం ఉన్న మోటార్లను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క చోట మాత్రమే అత్యధికంగా 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న భారీ మోటారును ఏర్పాటు చేశారు. ఈ మోటారును ఇంజినీర్లు బాహుబలి మోటారుగా పిలుచుకున్నారు. అయితే పాలమూరు ప్రాజెక్టులో వినియోగిస్తున్న మోటారు సామర్థ్యం బాహుబలి మోటారుకు మించి 145 మెగావాట్ల సామర్థ్యం ఉండటం విశేషం. ప్రాజెక్టులోని ఐదు లిఫ్టుల్లో వినియోగిస్తున్న మొత్తం 34 మోటార్లు సైతం 145 మెగావాట్ల సామర్థ్యం ఉన్నవే.

■ ప్రాజెక్టులో భూగర్భంలో అతిపెద్ద సర్జిపూల్ నిర్మాణాన్ని చేపట్టడం గమనార్హం. స్టేజ్-2లోని ఏదుల పంపుహౌస్ వద్ద నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన సర్జిపూల్ పొడవు 357 మీటర్లు కాగా, వెడల్పు 31 మీటర్లు. ఈ సర్జిపూల్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ సర్జిపూల్‌గా చెబుతున్నారు. మొదట కృష్ణానదిలోని శ్రీశైలం జలాశయంలోని బ్యాక్‌వాటర్ నుంచి కోతిగుండు వద్ద 240 మీటర్ల స్థాయి నుంచి నీటిని తీసుకునేలా అప్రోచ్ కెనాల్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి హెడ్ రెగ్యులేటరీ ద్వారా వచ్చిన నీటిని మూడు టన్నెళ్ల ద్వారా భూగర్భంలో ఏర్పాటు చేసిన సర్జిపూల్‌లో నింపుతారు. నార్లాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన పంపుహౌస్‌లోని మొత్తం 9 మోటార్లతో సర్జిపూల్‌లోని నీటిని 104 మీటర్ల ఎత్తులో ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు. ఇక్కడి నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు 21.81 కి.మీ. దూరం కాల్వ, మరో 15.89 కి.మీ. దూరం వరకు రెండు సొరంగాల్లో నీటిని తరలిస్తారు. ఇక్కడ 145 మీటర్ల లోతులో ఉన్న సర్జిపూల్ నుంచి నీటిని ఎత్తిపోసి ఏదుల రిజర్వాయర్‌ను నింపనున్నారు. ఇక్కడి నుంచి 21.47 కి.మీ. దూరం వరకు రెండు టన్నెళ్ల ద్వారా నీటిని తరలించి వట్టెం రిజర్వాయర్‌ను నింపుతారు. ఇక్కడి నుంచి భూత్పూర్ మండలంలో ఏర్పాటుచేసిన కర్వెన రిజర్వాయర్‌కు 9.75 కి.మీ. లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలిస్తారు. ఇక్కడి నుంచి 8.3 కి.మీ. దూరం పాటు రెండు టన్నెళ్లలో నీటిని ఉదండాపూర్ సర్జిపూల్ వరకు తరలించి ఐదు పంపుల ద్వారా రిజర్వాయర్‌ను నింపుతారు. ఇక్కడి నుంచి 18.85 కి.మీ. ఓపెన్ కెనాల్, మరో 4.4 కి.మీ. సొరంగమార్గంలో నీటిని తరలించి రంగారెడ్డి జిల్లాలోని కేపీ లక్ష్మీదేవిపల్లి పంపుహౌస్ వరకు నీరు చేరేలా ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టు మొత్తంలో ఆరు భారీ రిజర్వాయర్లు, ఐదు లిఫ్టుల్లో మొత్తం 34 మోటార్లతో నీటి ఎత్తిపోతలను చేపట్టనున్నారు.

రిజర్వాయర్లకు
స్థానిక దేవతామూర్తుల పేర్లు..

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో మొత్తం ఆరు రిజర్వాయర్లను ఏర్పాటుచేయగా, వీటికి ప్రభుత్వం స్థానిక ఆలయాల్లోని దేవతామూర్తుల పేర్లనే పెట్టింది. నార్లాపూర్ రిజర్వాయర్‌లో అంజనగిరి గ్రామం ముంపునకు గురి కాగా, ఆ గ్రామంలోని హనుమాన్ దేవాలయం పేరుతోనే అంజనగిరి రిజర్వాయర్‌గా, ఏదుల రిజర్వాయర్‌కు స్థానిక దైవం ఎర్రగట్టు అంజనేయస్వామి పేరుతో వీరాంజనేయ రిజర్వాయర్‌గా, వట్టెం రిజర్వాయర్‌కు వెంకటాద్రి రిజర్వాయర్‌గా, కర్వెన రిజర్వాయర్‌కు కురుమూర్తిరాయ రిజర్వాయర్‌గా ప్రభుత్వం నామకరణం చేసింది.

ఉపరితలంపైనే సబ్‌స్టేషన్లు..

నీటి ఎత్తిపోతలకు వీలుగా భూగర్భంలో పంపుహౌస్‌లను ఏర్పాటుచేయగా మోటార్లకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్లు మాత్రం భూఉపరితలంపై ఏర్పాటు చేశారు. భూగర్భంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టాన్ని తప్పించేందుకు వీలుగా అన్ని చోట్ల ఉపరితలంపైనే విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. అలాగే భూగర్భంలో సొరంగ మార్గాలను తవ్వేందుకు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను వినియోగించాల్సి వచ్చింది. అయితే ఈ క్రమంలో పంప్‌హౌస్, మిగతా నిర్మాణాలు దెబ్బతినకుండా ఉండేందుకు పేలుళ్లకు కంట్రోల్డ్ బ్లాస్టింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు
సాగునీటి లక్ష్యం: 12.30 లక్షల ఎకరాలు

రిజర్వాయర్ల సామర్థ్యం

రిజర్వాయర్	సామర్థ్యం
నార్లాపూర్	6.40 టీఎంసీలు
ఏదుల	6.55 టీఎంసీలు
వట్టెం	16.74 టీఎంసీలు
కర్వెన	17.34 టీఎంసీలు
ఉదండాపూర్	16.3 టీఎంసీలు

న్యూస్‌రీల్

వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక స్క్రీనింగ్



వనపర్తి: జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో 30 ఏళ్ల పైబడిన వారిలో వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ చేయాలని జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ శిక్షణ కేంద్రంలో ఆశా కార్యకర్తలకు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. నడి వయస్కుల్లో చాలామందికి రక్తపోటు, మధుమేహం లక్షణాలు ఉన్నట్లుగా తెలుస్తోందని.. స్క్రీనింగ్‌తో స్పష్టంగా గుర్తించి చికిత్స కోసం ఆయా ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్‌సెంటర్లకు సిఫార్సు చేయాలని సూచించారు. జన్యుపరంగా వచ్చే వ్యాధులు, ఎన్‌సీడీ వ్యాధులు, జాగ్రత్తలను ఆశా కార్యకర్తలకు వివరించారు.

చిన్నమందడికి రాష్ట్రస్థాయి పురస్కారం



కొత్తకోట రూరల్: మండలంలోని చిన్నమందడి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆ శాఖ ప్రధానకార్యదర్శి చేతుల మీదుగా సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో గ్రామంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందని, అందరి సహకారంతోనే సాధ్యమైందని వివరించారు.

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి



పెబ్బేరు/వీపనగండ్ల: నియోజకవర్గాన్ని చరిత్ర పుటల్లో నిలిపిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రభుత్వానికి మరోమారు ప్రజలు అఖండ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి కొల్లాపూర్‌కు రానున్నారని.. మహిళలు, యువత, రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎత్తం బాలస్వామి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సాయిబాబ, శేఖర్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టెట్ నిర్వహణకు సర్వం సిద్ధం

- కేంద్రాలను పరిశీలించిన ఆర్‌జేడీ ఉషారాణి



జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ ఉషారాణి, హెచ్‌ఎం

వనపర్తి: జిల్లాలో శుక్రవారం రెండు విడతలుగా నిర్వహించే టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)కు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి 12 వరకు పేపర్- 1 పరీక్ష జరగనుంది. ఇందుకుగాను వనపర్తి, కొత్తకోటలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 7,186 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగనుండగా.. ఇందుకుగాను 25 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. పేపర్-2 పరీక్ష 5,547 మంది అభ్యర్థులు రాయనున్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. పరీక్షల నిర్వహణకుగాను ఇన్విజిలేటర్లు, సూపర్‌వైజర్లు, సెంటర్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఇదిలా ఉండగా జిల్లాకేంద్రంలోని పరీక్ష కేంద్రాలను గురువారం ఆర్‌జేడీ ఉషారాణి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

వనపర్తిటౌన్: వినాయకచవితికి మట్టి ప్రతిమలు ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు పర్యావరణంపై ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ నరహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని.. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు tspcbquiz.glensserver.com వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి
- కొల్లాపూర్‌లో సీఎం సభాస్థలం పరిశీలన



ఎల్లూరు పంప్‌హౌస్ సర్జ్‌పూల్ వద్ద ఇంజినీర్లతో మంత్రి నిరంజన్‌రెడ్డి

కొల్లాపూర్: ప్రజా సంక్షేమానికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం కొల్లాపూర్‌లో సీఎం సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లను వారు వేర్వేరుగా పర్యవేక్షించారు. సభావేదిక వద్ద రక్షణ చర్యలు, ప్రజలు, వీఐపీలు కూర్చునేందుకు చేస్తున్న ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. అధికార యంత్రాంగం అంతా అందుబాటులో ఉండాలని, శుక్రవారం రాత్రి వరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టు ద్వారా డిసెంబర్ చివరికల్లా నీళ్లు ఇస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారు.. ఆ ప్రకారమే సెప్టెంబర్‌లోనే నీళ్లు ఇస్తున్నామని వివరించారు. కాల్వలు తవ్వకుండానే ప్రాజెక్టు ప్రారంభిస్తున్నారని చెబుతున్నారు.. వారు చేపట్టిన ప్రాజెక్టులన్నీ పనులు పూర్తయ్యాకే ప్రారంభించారా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు జరిగి, రిజర్వాయర్లలో నీళ్లు నింపితే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దశలవారీగా కాల్వలు కూడా పూర్తవుతాయని, అప్పటి వరకు ఓపిక పట్టకుంటే ఎలా అన్నారు. ప్రాజెక్టు ప్రారంభిస్తున్నందుకు రైతులంతా సంతోషపడుతుంటే ఇతర పార్టీల నాయకులు మాత్రం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందేమో అనే భయంతో విమర్శలు చేస్తున్నారన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

సీఎం సభ కోసం ఒక్కరోజే గడువు ఉండడంతో ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్ ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని ఆరా తీస్తూ.. పర్యవేక్షణ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తుండగా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గురువారం సందర్శించారు. అయితే పట్టణంలోని పీజీ కళాశాల ప్రాంగణంలో, పాలమూరు ప్రాజెక్టు వద్ద రెండు చోట్లా హెలీప్యాడ్లు నిర్మిస్తుండగా కొల్లాపూర్‌లో సభావేదిక చుట్టూ బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చే అవకాశం ఉండడంతో ఆయన ఇంటి ముందు ఉన్న రోడ్డును వెడల్పు చేశారు. సభ రోజున ట్రాఫిక్ జాం తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్పీ మనోహర్ చెప్పారు.

పంప్‌హౌస్ పరిశీలన

పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. స్విచ్ బోర్డుల పనితీరు గురించి నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి మంత్రికి వివరించారు. కేసీఆర్ ప్రారంభించే స్విచ్ బోర్డు, ఆయన తిలకించే ప్రాంతాలను చూపించారు. ప్రాజెక్టు సర్జ్‌పూల్, హెడ్ రెగ్యులేటరీ, ఔట్‌లెట్ పంపింగ్ సిస్టం, వెట్‌రన్ గురించి ప్రాజెక్టు ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచందర్‌యాదవ్, జంబులయ్య తదితరులున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన

- జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ భారతి లక్పతీనాయక్




మాట్లాడుతున్న జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ భారతి లక్పతీనాయక్

వనపర్తి: ఓటరు జాబితాను పూర్తి పారదర్శకతతో రూపొందించాలని జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ భారతి లక్పతీనాయక్ సూచించారు. గురువారం ఆమె జిల్లాలో పర్యటించి సమీకృత కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ఎస్‌ఎస్‌ఆర్ రెండో సమీక్ష సమావేశానికి హాజరై మాట్లాడారు. సరైన ఆధారాలుంటేనే.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని, బల్క్ అర్జీలను ప్రోత్సహించరాదని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సరైన సమాచారం అందించాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియని.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో కీలకపాత్ర పోషించేది ఓటుహక్కు మాత్రమేనని ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని.. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లేవల్ ఏజెంట్లను నియమించి ఓటరు నమోదు 100 శాతం జరిగేలా భాగస్వాములు చేయాలన్నారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా అక్టోబర్‌లో తుది ఓటరు జాబితాను విడుదల చేయాలని కోరారు. కొత్త ఓటరు నమోదుకు ఈ నెల 19 వరకు మాత్రమే సమయం ఉన్నందున అర్హత ఉన్న ఏ ఒక్కరూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వారికి సెలవులు ఇవ్వడం కుదరదని తెలిపారు. పోలింగ్‌స్టేషన్ లొకేషన్ పేరులో కొన్నిచోట్ల ఎస్సీకాలనీగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని బీఎస్పీ నాయకులు కోరారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మృతిచెందిన 40 మంది ఓటర్లు ఉన్నారని.. వారిపేర్లు తొలగించాలని గ్రామ ప్రతినిధి కొండారెడ్డి అబ్జర్వర్ దృష్టికి తీసుకొచ్చారు. ఉదయం 7 నుంచి 10 వరకు గ్రామాల్లో పౌరులు అందుబాటులో ఉంటారని.. ఆ సమయంలో విచారణ చేయాలని కోరారు. సమావేశం తర్వాత జిల్లాకేంద్రంలోని మర్రికుంట పోలింగ్ కేంద్రాన్ని ఆమె కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అధికారులతో కలిసి సందర్శించారు. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించే లక్ష్యంతో క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆమెకు వివరించారు. ఖిల్లా ఘనపురం మండలం మామిడిమాడ, మామిడిమాడతండాలో ఓటర్ల మార్పు ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, ఎన్నికల సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ రక్షిత కె.మూర్తి



మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: రానున్న వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి కోరారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో 15వ తేదీలోగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతేడాది జిల్లాలో 1,222 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో ఉందని.. ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెడుతూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారని.. సత్య, అసత్యాలను ఆలోచించాలని కోరారు. అభ్యంతరకర పోస్టులుంటే అందుబాటులో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు, నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు, చెరువుల ఎంపిక, రోడ్ల మరమ్మతులు, విద్యుత్, మంచినీటి సౌకర్యం, శోభాయాత్ర మార్గాలు నిర్ణయించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతి సమావేశాలు నిర్వహించి సూచనలు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, రహదారుల నడుమ, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయనివ్వొద్దని సూచించారు. ప్రతి మండపానికి జియోట్యాగింగ్ ఉండాలన్నారు. మూడుదశల్లో పనుల కేటాయింపు ఉండాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో మండపాల నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంపై అవగాహన కల్పించడం, విగ్రహ విక్రయ కేంద్రాలు, ఊరేగింపు మార్గాల్లో బందోబస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రెండోదశలో భక్తులకు అసౌకర్యం కలగకుండా విగ్రహాల సందర్శన సమయాల్లో గస్తీ నిర్వహించడం, మూడోదశలో నిమజ్జనం, శోభాయాత్ర సమయంలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు తప్పనిసరి

కొత్తకోట: అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని దేవరకద్ర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నటరాజన్ అన్నారు. గురువారం పట్టణంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని.. ఓటుతో మంచి పాలకుడిని ఎన్నుకోవచ్చన్నారు. తహసీల్దార్ బాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సహదేవ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



సోనియాగాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం

- ఏఐసీసీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిశీలకుడు పీవీ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ మోహన్

వనపర్తిటౌన్: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐసీసీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిశీలకుడు పీవీ మోహన్ అన్నారు. గురువారం రాత్రి జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న జరిగే విజయభేరి సభకు ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న వారంతా కలిసికట్టుగా నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తీసుకురావాలని కోరారు. సభలో సోనియాగాంధీ విడుదల చేసే మేనిఫెస్టోను 18వ తేదీన నియోజకవర్గాల వారీగా సభలు ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని అన్ని రాజకీయ పార్టీలకు తెలిసేలా విజయభేరి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, 42 మంది ఎమ్మెల్యేలను వనపర్తి నియోజకవర్గానికి తీసుకొచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియాగాంధీకి వివరించడంతో ప్రత్యేక రాష్ట్ర కల నెరవేరిందని గుర్తుచేశారు. చేవెళ్ల జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి నుంచి పార్టీలకతీతంగా ప్రజలు సభకు హాజరు కావాలన్నారు. పెద్దమందడి ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు మేఘారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంత్రి నిరంజన్‌రెడ్డిని గద్దె దింపే వరకు సమష్టిగా పోరాటం చేస్తామని, తుక్కుగూడలో జరిగే సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ప్రజలను తరలిస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, నాయకులు పర్వతాలు, వెంకట్రాములుయాదవ్, విజయ్‌కుమార్, రాములు యాదవ్, వెంకటనారాయణ, పెంటయ్య, యాదయ్య, జానకిరాములు, హర్షద్, కొంకి వెంకటేష్, నరేందర్‌గౌడ్, సమద్, కదిరె రాములు, చంద్రశేఖర్, డి.వెంకటేష్, బ్రహ్మం, వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్యాములు (ఫైల్)

బల్మూర్: వ్యవసాయ పొలం వద్ద పంట చేనుకు నీరు పెట్టడానికి వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని జీన్‌కుంటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కాల శ్యాములు(35) ఉదయం తన వ్యవసాయ పొలంలో వరి పంటకు బోరు నీళ్లు పెట్టడానికి వెళ్లగా అప్పటికే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరు మోటారుకు లాగి ఉన్న తీగలు తెగి పడి ఉన్నాయి. వీటిని గమనించకుండా వెళ్లడంతో తీగలు కాళ్లకు తాకి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్యాములుకు భార్య అంజనమ్మతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి బతికే కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమని, మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి బాలుడు..

పెబ్బేరు రూరల్: చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బాలుడు మృతి చెందిన ఘటన వనపర్తి మండలం కడుకుంట్లలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కడుకుంట్ల చెందిన అర్జున్ (14) బుధవారం గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం చెరువులో శవమై తేలాడు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

మల్దకల్: మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. మల్దకల్‌కు చెందిన దేవసాయం (36) తనకున్న కొద్దిపాటి పొలంలో పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడి నిత్యం భార్యతో గొడవ పడేవాడు. బుధవారం మద్యానికి భార్యను డబ్బులు ఇవ్వమని అడుగగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్థాపం చెందిన దేవసాయం పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వివరించారు. భార్య సునంద, ముగ్గురు సంతానం ఉన్నారు.

ఆటో బోల్తా.. మహిళ దుర్మరణం

ఎర్రవల్లిచౌరస్తా: కూరగాయల ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన జయమ్మ (33), ఆమె బావ వెంకట్రాములుతో కలిసి అదే గ్రామానికి చెందిన నిరీక్షణ్ ఆటోలో కూరగాయలు వేసుకొని శాంతినగర్ నుంచి కోదండాపురానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కోదండాపురం సమీపంలోకి రాగానే ఆటోను డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయమ్మకు తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్‌కు, వెంకట్రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని కర్నూల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. భర్త ఆకుల రాజు ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పాతబజార్‌లో గురువారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు వివరాల ప్రకారం పాతబజార్‌కు చెందిన వావిడాల శ్రీనివాస్(50) ఆరు నెలల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. మనస్థాపంతో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పట్టపగలే చోరీ

మానవపాడు: స్థానిక ఎస్సీకాలనీలో బుధవారం ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మాల హుస్సేన్ 3 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. రోజులాగే భార్య పొలానికి వెళ్లగా.. వ్యక్తిగత పని నిమిత్తం హుస్సేన్ శాంతినగర్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన భార్యాభర్తలు తలుపులు తెరిచి చూడగా బీరువా తాళం విరిగి కనిపించడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.10 లక్షల నగదు, 8 గ్రాముల బంగారు చెవి దుద్దులు, 23 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గురువారం ఫిర్యాదు చేశారని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ బృందం పరిశీలించింది.


చిన్నారిని అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


అలరించిన జానపద నృత్యం

భళా.. బాలోత్సవం


చిన్నారి నృత్య ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో గురువారం పిల్లలమర్రి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవం–పిల్లల పండుగ అలరించింది. జిల్లావ్యాప్తంగా 60 పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు మొదటి రోజు 21 వేదికల్లో 42 అంశాల్లో ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కోలాటాలు, జానపద నృత్యాలు, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. ఈవెంట్స్‌కు న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణారావు, జి.కృష్ణ, శ్రీకాంత్, జనార్దన్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు.


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలి..

పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పిల్లలమర్రి బాలోత్సవ్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శలను తిలకించి అభినందించారు. మంత్రి మాట్లాడుతూ చిన్నారులు మట్టిలో మాణిక్యాలు అని, వారిని చదువుతో పాటు ఆటల్లో ప్రోత్సహించాలన్నారు. జిల్లా కేంద్రంలోని శిల్పారామాన్ని చిన్నారుల భూతల స్వర్గంగా తీర్చిదిద్దామని తెలిపారు. త్వరలో శిల్పారామంలో చిన్నారుల గేమ్స్ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బెక్కం జనార్దన్, డాక్టర్ పి.ప్రతిభ మాట్లాడుతూ చిన్నారుల్లో ఒత్తిడిని తగ్గించి సృజనాత్మకత, సామాజిక స్పృహ పెంచేందుకే బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు డీఈఓ రవీందర్ అన్ని స్టాళ్లను సందర్శించి చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, రాజేశ్వర్‌గౌడ్, కొరమోని వెంకటయ్య, వనజ, యాదమ్మ, లయన్ నటరాజ్, వీరాంజనేయులు, జగపతిరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అయిజ: పట్టణ సమీపంలోని పెద్దవాగులో గురువారం అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌కు చెందిన పూసల రాముడు(32) ఇంటి తాళాలు మరమ్మతు చేస్తూ జీవనం సాగించేవాడు. తాగుడికి బానిస కావడంతో భార్య గతంలోనే ఆయనను వదిలి వెళ్లిపోయింది. అయితే మద్యం మత్తులో బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వాగులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై రాముడు అన్న బద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుందుభీ వాగులో వృద్ధుడు..

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారు దుందుభీ వాగులో గురువారం మధ్యాహ్నం మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు మృతదేహాన్ని వెలికి తీయించి.. పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి జడ్చర్ల మండలంలోని గంగాపూర్‌కు చెందిన మల్లేపల్లి చెన్నకేశవులు(60)గా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు హైదరాబాద్‌లో ఉండగా.. చెన్నకేశవులు గ్రామంలోని భారత్ పెట్రోల్ బంకులో పనిచేస్తుంటాడని స్థానికులు తెలిపారు. వృద్ధుడి భార్య బిడ్డ కాన్పు కోసం హైదరాబాద్ ఇటీవలే వెళ్లిందని పేర్కొన్నారు. ఈ విషయమై బంధువుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పోరాటాలతోనే బీసీలకు సీఎం పదవి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

వనపర్తి టౌన్: విద్యార్థి దశ నుంచే అలుపెరగని పోరాటాలు చేస్తే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం వనపర్తిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ విద్యార్థి సమరభేరికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో అధికార యంత్రాంగం నుంచి రాజకీయ రంగం వరకు బీసీలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్తే కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులుగానేగాక ముఖ్యమంత్రులుగా ఎదుగుతారనే ఆకాంక్ష ఉందని.. అందుకే బీసీల ఐక్యత కోసం విద్యార్థి దశ నుంచి సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. బీసీ విద్యార్థులందరూ భవిష్యత్ లక్ష్యంపై దృష్టి సారిస్తే రాజ్యాధికారం సొంతం అవుతుందని.. సముచిత స్థానం కల్పించాల్సిన అనివార్య పరిస్థితులు వచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. అణగారిన వర్గాలు చదువును ఆయుధంగా చేసుకొని కలలుగన్న భవిష్యత్‌ను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.20 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చదువుకునే అమ్మాయిలకు పాకెట్ మనీ రూ.వెయ్యి, అబ్బాయిలకు రూ.500, రాష్ట్రంలో కొత్తగా 120 బీసీ గురుకులాలు ఏర్పాటు చేయాలని, అందులో వనపర్తికి నాలుగు గురుకుల విద్యాలయాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం క్రియాశీలకంగా పనిచేస్తున్న బీసీ సంఘం నేతలు, విద్యార్థి నాయకులను కృష్ణయ్య సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అరవింద్‌స్వామి, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బయ్య, నక్కరాములు యాదవ్ పాల్గొన్నారు.

50 శాతం సీట్లు కేటాయించాలి

జడ్చర్ల: చట్టసభల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించేలా అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయం తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య అన్నారు. సమాజంలో 50 శాతం జనాభా ఉన్న బీసీలకు రాజకీయ పార్టీలు సమ ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఇందుకు బీసీలు ఎక్కడికక్కడ మిలిటెంట్ పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీసీలపై కనిపించని వివక్ష, దోపిడీ, పీడన కొనసాగుతుందన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఇప్పటికే టికెట్లు ప్రకటించిందని గతంలో బీసీలకు 26 సీట్లు ఇవ్వగా.. ఈసారి 21 సీట్లకే పరిమితం చేసిందని విమర్శించారు. ఏపీలో సీఎం జగన్ బీసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వగా.. తెలంగాణలో ఆ పరిస్థితి లేదన్నారు. అనంతరం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేలా కృషి చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

కాలుష్యపు కంపెనీలపై చర్యలు

- కాలుష్య నియంత్రణ మండలి జేసీఈ కృపానందం


కాలుష్యపు ఆనవాళ్లు కనిపించకుండా పొక్లెయిన్‌తో తవ్విన దృశ్యం


రైతు పొలంలో నీటినమూనా సేకరిస్తున్న పీసీబీ సిబ్బంది

రాజాపూర్: పోలేపల్లి సెజ్ నుంచి సమీప వ్యవసాయ పొలాల్లోకి వర్షపు నీటితో పాటు కాలుష్యపు జలాలు వదులుతుండటంతో ఏళ్లుగా పంటలు పండక, పశువులు మృత్యువాతపడుతూ రాయపల్లి, ముదిరెడ్డిపల్లి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం విధితమే. దీనిపై రైతులు గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు హైకోర్టులో కేసు వేశారు. ఈ నెల 27న హైకోర్టులో కేసు విచారణ ఉండటంతో గురువారం కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కృపానందం, ఇతర అధికారులు పరిశ్రమల నుంచి బయటకు వస్తున్న కాలుష్యపు నీటిని గుర్తించారు. నిబంధనలు పాటించకుండా పరిశ్రమల నుంచి బయటకు నీటిని వదిలే పైపులను గుర్తించి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీ తీరు మారదు..

'ఎన్నిసార్లు జరిమానాలు విధించినా తీరు మారదు.. కొందరికి ఉపాధి లభించవచ్చుగాని కాలుష్యపు నీటిని వదలడంతో ఎన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడతారో తెలుసా...' అంటూ పరిశ్రమల ప్రతినిధులపై జేసీఈ కృపానందం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ పరిశ్రమ నిర్వాహకులు పొక్లెయిన్ సాయంతో బయటకి వదిలిన కాలుష్యపు నీటి ఆనవాళ్లు కనబడకుండా చేసిన తీరును పీసీబీ అధికారులు గుర్తించి మట్టి, నీటి నమూనాలు సేకరించారు. యామ్నిల్ పరిశ్రమలోకి వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బంది గేట్ తెరవకపోవడంతో అధికారులు 20 నిమిషాలకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. రాయపల్లి, ముదిరెడ్డిపల్లి చెరువులు, చుట్టుపక్కల రైతుల బోర్లలోని నీటి నమూనాలు సేకరించారు.

డ్రెయినేజీలు లేకపోవడంతోనే..

పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన టీఎస్‌ఐఐసీ సెజ్‌లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు వర్థ్య జలాలను రైతుల పొలాల్లోకి వదులుతున్నారని అక్కడికి వచ్చిన కొందరు అధికారులు చర్చించుకున్నారు.

పదేళ్లుగా పోరాడుతున్నాం..

మేము పరిశ్రమలకు వ్యతిరేకం కాదు.. కాలుష్యం వదిలే పరిశ్రమలపైనే పది సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని ముదిరెడ్డిపల్లి రైతు కోస్గి వెంకటయ్య, రాయపల్లి రైతు గణేష్‌గౌడ్ అధికారులకు విన్నవించారు. నిబంధనలు పాటించని పరిశ్రమల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

ఎర్ర కాల్వకు గండి


నీటి ఉధృతికి కొట్టుకుపోయిన వరి పంట

- దెబ్బతింటున్న వరి పంటలు


ఎర్ర కాల్వకు గండిపడి పొలాల్లోకి చేరుతున్న నీరు

అడ్డాకుల: మూసాపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఎర్ర కాల్వకు నీటి ప్రవాహం పెరగడంతో తరచూ గండి పడుతోంది. దీంతో ప్రతి ఏటా వరి పంటలకు నష్టం వాటిల్లుతోంది. 2021లో కాల్వకు గండిపడి వరి పంటలు దెబ్బతినడంతో రైతులందరు కలిసి పూడ్చి వేశారు. తాజాగా మరోమారు గండి పడటంతో కాల్వ దిగువన ఉన్న వరి పంటలకు నష్టం వాటిల్లింది. 2011లో గండిపడిన ప్రాంతానికి కొంతదూరంలో మరోసారి గండి పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా కాల్వకు గండ్లు పడి పంటలకు నష్టం జరుగుతున్నా పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుకు దూరం..

మూసాపేట చౌటచెరువు అలుగు నుంచి కొమిరెడ్డిపల్లి చెరువు వరకు ఎర్ర కాల్వ సుమారు 3 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. చౌట చెరువు అలుగు పారితే ఎర్ర కాల్వ ద్వారా కొమిరెడ్డిపల్లి చెరువుకు నీరు చేరుతుంది. అక్కడి నుంచి పొన్నకల్, దుబ్బపల్లి, నాగాయపల్లి, రాచాల వరకు సుమారు 8 చెరువులు, కుంటలకు నీరు చేరేలా ఎర్ర కాల్వను పూర్వ కాలంలోనే ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో కొన్నేళ్లుగా తరచూ పలుచోట్ల కాల్వకు గండ్లు పడుతుండటంతో నీరంతా వరి పంటల్లోకి చేరుతోంది. ఎర్ర కాల్వకు మరమ్మతులు చేయిస్తే ఆరు గ్రామాల రైతులకు మేలు చేకూరుతుంది. చౌట చెరువు అలుగు పారితే ఎర్ర కాల్వ ద్వారా ఆరు గ్రామాల్లోని సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని.. బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు పాడవుతున్నాయి..



ఎర్ర కాల్వకు ఆలయం సమీపంలో గండి పడింది. నీరంతా పెద్ద ఎత్తున పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటున్నాయి. రెండేళ్ల కిందట గండి పడితే రైతులమే పూడ్చాం. మళ్లీ ఇప్పుడు గండిపడి పంటలు దెబ్బతింటున్నాయి.

– నాగరాజు, రైతు, మూసాపేట

మరమ్మతుకు చర్యలు..

ఎర్ర కాల్వకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించాం.. పూడ్చేందుకు చర్యలు చేపడుతాం. ఇందుకోసం ప్రతిపాదనలు పంపుతున్నాం. రైతులు కాల్వను సన్నగా చేయడంతోనే సమస్య ఏర్పడుతోంది. పంటలకు నష్టం కలుగకుండా చర్యలు చేపడతాం.

– శ్రీనివాసులు, ఏఈ, నీటిపారుదలశాఖ

పారదర్శకంగా పనులు చేయించాలి

అడ్డాకుల: ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. మూసాపేట రైతువేదికలో గురువారం ఉపాధి హామీ పథకం రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2021 సెప్టెంబర్ 1నుంచి 2023 మార్చి 31 వరకు సుమారు రూ.4.42 కోట్లతో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. వీటిలో కూలీలకు రూ.3.24 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.17 కోట్లు ఖర్చు చేయగా, ఎస్‌ఆర్‌పీ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో 5 మంది బీఆర్‌పీలు పనులను పరిశీలించి నివేదికలను రూపొందించారు. ఉపాధి హామీ పనులపై ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సమక్షంలో ప్రజావేదిక నిర్వహించగా.. ఏపీడీ శ్రీపాదు, విజిలెన్స్ అధికారి ప్రేమలత, ఏపీసీ ఆంజనేయగౌడ్, ఎంపీపీ కళావతి, ఎంపీడీఓ స్వరూప, అంబుడ్స్‌మెన్ సంతోష్‌కుమార్ హాజరయ్యారు. మండలవ్యాప్తంగా రూ.11,290లను ఉపాధి సిబ్బంది నుంచి రికవరీకి అధికారులు ఆదేశించారు. వేముల, జానంపేట, చక్రాపూర్ గ్రామాల్లో హరితహారం కింద నాటిన మొక్కల్లో కొన్నింటిని తొలగించిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటించాలని సూచించారు. ఇదిలా ఉండగా ప్రజావేదికకు సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీఓ సరోజ, ఏపీఓ పులేందర్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం


మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజిద్దామని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను గురువారం కలెక్టరేట్‌లో ఉద్యోగులకు పంపిణీ చేశారు. పీఓపీతో తయారు చేసిన మట్టి వినాయకులతో చెరువుల్లో నీళ్లు కలుషితం కావడంతోపాటు వాతావరణ కాలుష్యానికి దారితీస్తుందన్నారు. మట్టి విగ్రహాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీత, డీఆర్‌ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ శంకర్, బీసీ సంక్షేమాధికారి ఇందిర పాల్గొన్నారు.

దొంగలకు దేహశుద్ధి

జడ్చర్ల: స్థానిక శాంతినగర్‌లో గురువారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులకు కాలనీ వాసులు దేహశుద్ధి చేశారు. కమ్యూనిటీ హాల్‌లో నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. ఇంటి ముందు నిలిపిన మోటార్ బైక్‌లను అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా కాలనీకి చెందినవారు గమనించి పట్టుకున్నారు.

ఏజెన్సీకి ఫీవర్

గోదావరి పరీవాహక ప్రాంతంలో విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాలు

వర్షాలు, వరదలతో నిన్న మొన్నటి వరకు అవస్థలు • తిరిగి అవే ప్రాంతాల్లో మంచం పట్టిన జనం

సాక్షిప్రతినిధి, వరంగల్: జూలై ,ఆగస్టు మాసాల్లో కురిసిన ఎడతెరపి లేని వర్షాలు గోదావరి పరీవాహక ఏజెన్సీ పల్లెలను కుదిపేశాయి. ఇప్పుడా ప్రాంతాలను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొమురమ్‌భీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు అనేక గ్రామాలు డెంగీ, మలేరియాల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి పూర్వ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆయా జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే ఎనిమిదిమంది వృద్ధులు, మహిళలు, బాలురు మృత్యువాత పడగా, 15 నుంచి 25 రోజులైనా తగ్గని జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా జ్వరపీడితులే...

- వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు.. ఇప్పుడు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో విలవిలలాడుతున్నాయి. మహా ముత్తారం, గణపురం, తాడిచర్ల, రేగొండ, కాటారం, మొగుళ్లపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 250 మంది ఔట్‌పేషెంట్లుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.
- ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని పల్లెలు మంచం పట్టాయి. జిల్లాలో గత జనవరి నుంచి 51 మలేరియా, 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం తదితర మండలాల్లోని 39 గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు జనాలను జడిపిస్తున్నాయి. ముత్తారం మండలంలో బేగంపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందగా... డెంగీ బాధితుల సంఖ్య 89కి చేరినట్టు అధికారులు ప్రకటించారు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు, దంతాలపల్లి, మరిపెడ, కొత్తగూడ, గంగారం, కేసముద్రం, గార్ల తదితర మండలాల్లో డెంగీ, విషజ్వరాలు జడలు విప్పాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విషజ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 162, డెంగీ 273, విషజ్వరాలు 2,35,835 కేసులు నమోదయ్యాయి.

ములుగు జిల్లాలో | డెంగీతో నలుగురు మృతి

- వారికి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉండటం వల్లేనంటున్న అధికారులు
- సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష
- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మరణించారని ఆ జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వైద్యాధికారులు డెంగీ మరణాలపై మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు.

జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు...

రాష్ట్రంలో అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పిల్లల జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్న అంశాలను మంత్రి వివరించారు. డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదన్నారు. జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని, ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్‌వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల్లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. మీడియా సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు

ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి



రజని (ఫైల్) మనీష (ఫైల్) మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని (35), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో నివాసి మనీష (30) విషజ్వరంతో మృతిచెందారు. వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప కూడా డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు 54 టెండర్లు

- మొత్తం 25 లాట్లలో 8 లాట్లకు ఒక్కొక్కరే బిడ్డింగ్
- మిగతా 17 లాట్లకు 46 సంస్థల పోటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లుల్లో మూలుగుతున్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంచి స్పందన లభించింది. తొలి విడతగా 25 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని విక్రయించాలని భావించిన పౌరసరఫరాల సంస్థ ఈ మేరకు గత నెలలో టెండర్లను ఆహ్వానించింది. 25 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని 25 లాట్లుగా విభజించి , ప్రతి ఎల్‌ఎంటీ ఒక లాట్‌గా ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించింది. గురువారంతో గడువు ముగియగా, సాయంత్రం 5 గంటలకు అధికారులు టెక్నికల్ బిడ్లు తెరిచారు. 25 లాట్ల కోసం మొత్తం 54 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో 8 లాట్లకు సంబంధించి కేవలం ఒక్కో బిడ్ మాత్రమే దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా 17 లాట్ల కోసం 46 సంస్థలు పోటీ పడ్డాయి.

యాసంగిలో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గత యాసంగి (2022–23)లో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని సేకరించారు. ఈ మొత్తం ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేయగా, అందులో కొంత భాగం అకాల వర్షాల కారణంగా తడిచిపోయింది. తడిచిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని కూడా ముడి బియ్యంగా మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు నిరాకరించారు. బాయిల్డ్ రైస్‌గా మాత్రమే ఇస్తామని చెప్పినా, కేంద్రం నిబంధనలతో అది సాధ్యం కాలేదు.

సినిమాల్లోని సీన్లపైనా నజర్

- డ్రగ్స్ వినియోగం ప్రేరేపించేలా ఉంటే చర్యలు
- ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమా టీమ్‌కు నోటీసులు
- బాలీవుడ్‌పైనా దృష్టి పెట్టేలా ఎన్సీబీకి సమాచారం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్–నాబ్) అధికారులు మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న జరిగిన ఓ డ్రగ్ పార్టీపై దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్... ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్, టీఎస్ నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చామని, వారు తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చారని గురువారం చెప్పారు. అందులో ఉన్న సీన్లపై తాము చెప్పిన తర్వాతే సినిమాలో వార్నింగ్ నోట్ పెట్టారని, అప్పటివరకు అలాంటిది కూడా లేదని అన్నారు. ఇలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలను సినిమాల్లో పెట్టవద్దని ఆనంద్ హితవు పలికారు. వీటి ద్వారా స్ఫూర్తి పొంది అనేక మంది యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సీన్లతో కూడిన సినిమాలు వచ్చాయని, అయితే వాటిని ఎవరూ పట్టించుకోలేదని చెప్పిన ఆనంద్.. ఇకపై ఈ తరహాలో ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'టాలీవుడ్ లింకులు ఉన్న డ్రగ్స్ కేసు'లో పరారీలో ఉన్న సూర్య.. స్నార్ట్ అనే పేరుతో పబ్ నిర్వహిస్తున్నాడని, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను స్నార్టింగ్ ప్రక్రియ ద్వారా వినియోగిస్తారని చెప్పారు. దీన్ని బట్టి సూర్య తన



వద్ద మాదకద్రవ్యాలు లభిస్తాయని అర్థం వచ్చేలా తన పబ్‌కు పేరు పెట్టాడని భావించాల్సి వస్తోందని ఆనంద్ వ్యాఖ్యానించారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించే సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరతామన్నారు. ఎన్సీబీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారని, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. తాము ఇటీవల కాలంలో 33 మంది నైజీరియన్లను అరెస్టు చేయగా, వారిలో 18 మంది బెంగళూరులో స్థిరపడిన వారిగా తేలిందన్నారు. టీఎస్ నాబ్ సేవల విస్తరణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరతామని చెప్పారు.

టాలీవుడ్ తెరపై మరో డ్రగ్ మరక

▶ మొదటి పేజీ తరువాయి

బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు ఏర్పాటు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి దీని ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు...

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్వావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణా రెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితోపాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నార్ట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే పీఎస్ కృష్ణ ప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదులు ఏర్పాటుచేసి డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవ్‌దీప్, రవి

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం 2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్వావే మైకేల్, థామస్‌తో పాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో పరారయ్యారు.

2 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం సాయంత్రం 16వేల క్యూసెక్కులు కొనసాగుతుందని పీజేపీ అధికారులు తెలిపారు. జలవిద్యుత్ కేంద్రంలోని ఎగువలో ఒక యూనిట్ ద్వారా 39 మెగావాట్లు, 85.379 ఎంయూ, దిగువలో ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్లు, 92.253 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 177.632 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్టు–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 7,803 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 141 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 725 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 11,299 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 855.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 855.6 అడుగుల వద్ద 93.3620 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,803 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,000, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,460, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 242 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కర్ణాటక మద్యం పట్టివేత

అలంపూర్: కర్ణాటక నుంచి తెలంగాణ, కర్నూల్ జిల్లాకు తరలిస్తున్న మద్యం డబ్బాలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. బొంకూరుకు చెందిన వడ్డె ప్రతాప్, రమేష్ కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని రైల్వేస్టేషన్ పక్కనున్న వైన్‌షాపు నుంచి మద్యాన్ని తరలిస్తుండగా, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. నిందితుల కారులో దాదాపు 36 కాటన్ బాక్స్‌లు ఉన్నాయి. దాదాపు 3456 టెటా బాక్స్‌లను పట్టుకున్నారు. కర్ణాటక నుంచి మద్యాన్ని రెండు రాష్ట్రాలు దాటించి కర్నూల్ జిల్లాలో ఓర్వకల్ తదితర మండలాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని.. ప్రతాప్‌ను అరెస్ట్ చేయగా, రమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కారును సీజ్ చేసి అలంపూర్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు సీఐ పటేల్ బానోత్ తెలిపారు.

కిటకిటలాడిన కురుమూర్తి



జాతర మైదానంలో భక్తుల రద్దీ

- ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు
- మార్మోగిన స్వామివారి గోవిందనామస్మరణ

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మాపురం కురుమూర్తిస్వామి దర్శనానికి శ్రావణమాసం ముగింపు అమావాస్యను పురస్కరించుకొని గురువారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ముందుగా అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చి గంటలకొద్ది క్యూలైన్లో నిల్చున్నారు. కొందరు భక్తులు వాటర్ ట్యాంకుల వద్ద తల స్నానాలు ఆచరించి తడిగుడ్డలతో మెట్లపై దీపాలు వెలిగిస్తూ.. గోవింద నామస్మరణతో స్వామి చెంతకు చేరారు. కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపాలను భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతోపాటు జాతర మైదానమంతా భక్తులతో కిటకిటలాడింది.

పార్కింగ్ సమస్యతో ఇబ్బందులు..

అమావాస్యను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అయితే అధికారులు సరైన పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు వాహనాలను జాతర మైదానంలో ఎటుపడితే అటు నిలిపివేశారు. దీనికి తోడు తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లపై బండ్లను అడ్డదిడ్డంగా నిలిపి వ్యాపారాలు కొనసాగించారు. దీంతో భక్తులు జాతర ప్రాంగణంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆలయ అధికారులు స్వామివారికి వచ్చే ఆదాయంపైనే దృష్టిసారిస్తున్నారు తప్ప.. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని పలువురు విమర్శించారు. ప్రతి అమావాస్యకు ఇక్కడికి వేలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోనేరులో స్నానాలకు నోచుకోని భక్తులు..

కురుమూర్తిస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో స్నానాలు ఆచరిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అందుకు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా కోనేరులో స్నానాలు ఆచరించి తడి గుడ్డలతో వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో అమావాస్యకు తరలివచ్చే భక్తులు కోనేరులో స్నానాలకు నోచుకోలేకపోతున్నారు. బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భాల్లో మాత్రమే కోనేరులో నీటిని నింపి భక్తులు స్నానాలు ఆచరించేలా చర్యలు చేపడుతున్నారు. శ్రావణమాసం, అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని లక్షలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివస్తారు. కోనేరులో నీరు లేకపోవడంతో వాటర్ ట్యాంకులు, కొళాయిల వద్ద స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తుల నమ్మకం, విశ్వాసాలు ఆలయ అధికారులకు పట్టవా అని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం అమావాస్య రోజైనా కోనేరులో నీటిని నింపి భక్తులు స్నానాలు ఆచరించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రైతు అల్లాజీది ప్రభుత్వ హత్యే..

- భూనిర్వాసితులకు ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకోలేదు
- పాలమూరుకు నీళ్లిచ్చి ప్రారంభోత్సవాలు చేయండి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



అల్లాజీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీకే అరుణ

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు రిజర్వాయర్‌లో భూమి కోల్పోయిన నిర్వాసిత రైతు మరణానికి ప్రభుత్వమే కారణమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. తమకు న్యాయమైన పరిహారంపై ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు రైతు అల్లాజీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించమంటూ నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెరలో మృతుని కుటుంబసభ్యులు బుధవారం ఉదయం నుంచి ఇంటివద్దే ఆందోళన చేపట్టారు. అల్లాజీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులను డీకే అరుణ పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు ఎక్కడా లేని విధంగా పరిహారం ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ నేటికి నెరవేరలేదని చెప్పారు. నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, న్యాయమైన పరిహారం ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ మూలకైనా ఎకరాకు రూ.2లక్షల పరిహారం ఉంటుందా? అని ప్రశ్నించారు. వట్టెం రిజర్వాయర్ కింద అల్లాజీకి చెందిన 5 ఎకరాలు మాత్రమే అవసరం ఉండగా, వారి కుటుంబానికి చెందిన మొత్తం 19 ఎకరాలను ఎందుకు సేకరించాలో చెప్పాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేయకుండానే ప్రారంభం చేయడం సిగ్గుచేటన్నారు. పనులు ప్రారంభించి తొమ్మిదేళ్లయినా ప్రాజెక్టు పూర్తిచేయకుండా ఎన్నికల ముందు డ్రామాలాడుతున్నారని చెప్పారు. మృతుడి కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దిలీపాచారి రూ.లక్ష ఆర్థికసాయాన్ని ప్రకటించారు.

కుమ్మెరలో ఉద్రిక్తత

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా చేపడుతున్న వట్టెం రిజర్వాయర్‌లో భూమి కోల్పోయిన రైతు అల్లాజీ సరైన పరిహారం దక్కడం లేదని బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గ్రామాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సాయంత్రం బీజేపీ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిలీపాచారి ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టగా పోలీసులు అడ్డుకొని తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు.

పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పూర్తిచేయకుండా ఒక్క మోటారును ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న సీఎం కేసీఆర్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత తొమ్మిదేళ్లుగా ఒక్కచోటా పనులు పూర్తిచేయక, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండా ఓట్లెలా అడుగుతారని ప్రశ్నించారు. మోటార్ల కొనుగోళ్ల కోసం కాంట్రాక్టు సంస్థకు ఎంత చెల్లించారో.. ఆ సంస్థ బీహెచ్‌ఈఎల్‌కు ఎంత చెల్లించిందో బయటపెట్టాలని కోరారు. ప్రభుత్వం రైతుబంధు పేరిట రూ.12 వేల కోట్లు చెల్లిస్తూ.. మద్యం అమ్మకాలతో ఏటా రూ.45 వేల కోట్ల దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. నిర్వాసిత రైతు అల్లాజీ ఆత్మహత్యకు బాధ్యుడు సీఎం కేసీఆరే అని మండిపడ్డారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

ఉమ్మడి రాష్ట్రంలోనూ లేనంతగా స్వరాష్ట్రంలో అధికార దుర్వినియోగం, పోలీసుల దౌర్జన్యం పెరిగిపోయిందని ఆరోపించారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే పనులను పరిశీలించేందుకు వస్తున్న వివిధ పార్టీల నాయకులను ఎందుకు అడ్డుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ప్రశ్నించారు. అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందితో సీఎం సభకు జన సమీకరణ చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, రవి, కోటయ్య, లక్ష్మయ్య, రామ్మోహన్‌రావు, విజయ్‌కుమార్‌రెడ్డి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను పరిశీలించిన ఇంజినీర్లు

- గ్రామంలోకి నీరు రాకుండా చర్యలు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట గండిని పూడ్చడంతో గ్రామం చుట్టూ ఉన్న వాగుల్లోని వర్షపు నీరు జలాశయంలోకి చేరి నీటిమట్టం పెరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో గురువారం నెట్టెంపాడు ఈఈ రహీముద్దీన్, డిప్యూటీ ఈఈతో పాటు ఏఈలు, ఎంపీపీ విజయ్‌కుమార్ రిజర్వాయర్ కట్ట వెంట పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగకుండా వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు కట్ట లోపలి భాగంలో సమాంతర కాల్వ ఏర్పాటు చేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ అధికారులకు సూచించారు. గ్రామస్తులను పునరావాస కేంద్రంలోకి తరలించిన తర్వాతే నీటిని వదులుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



రిజర్వాయర్ దగ్గర ఈఈతో మాట్లాడుతున్న ఎంపీపీ